ఏలూరు డిఇఒగా అబ్రహాం బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిగా ఎస్.అబ్రహాం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ డిఇఒ ఎస్.అబ్రహాంను అభినందించారు.

కలెక్టర్‌కు పూల మొక్క అందిస్తున్న డిఇఒ

అడియాశల బడ్జెట్..!

వైసిపి ప్రభుత్వం తన పదవీకాలంలో చివరిగా ప్రవేశ పెట్టిన ఓటన్ అకౌంట్ బడ్జెట్ జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి నిధుల కేటాయింపుపై అంకెల గారడీ ప్రదర్శించి గతం మాదిరిగానే బురిడీ కొట్టించింది. సాగునీటి ప్రాజెక్టులు, డెల్టా ఆధునికీకరణ పనులు, నిర్వాసితులకు ఇచ్చిన హామీలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలకు నిధులు ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అరకొరగానే కేటాయించింది. ఈ నిధులనూ చాలా పరిమితంగానే ఖర్చు చేసింది. ఈ నేపథ్యంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ అరకొర కేటాయింపులతో జిల్లావాసులు తీవ్ర నిరాశకు గురయ్యారు.



ఎన్నికల వేళ అరకొర కేటాయింపులతో మమ

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి నిధుల కేటాయింపుపై స్పష్టత కరువు

గత బడ్జెట్లో కేటాయింపులు అరకొరే.. ఖర్చు చేసింది కొసరే

పోలవరం నిర్వాసితులకు మొండిచెయ్యి

ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు నామమాత్రమే

ప్రజాశక్తి - భీమవరం

సంక్షేమం తప్ప జిల్లా అభివృద్ధిని మరిచిన వైసిపి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వైసిపి ప్రభుత్వం చివరి బడ్జెట్‌లోనైనా జిల్లాలోని ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు భారీగా చేస్తారని ఆశించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాను అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తారని ఆశించినప్పటికీ ఆ ఆశలు ఆవిరయ్యాయి. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కేవలం గతం మాదిరిగానే అంకెల గారడీతో మాట్లాడడం తప్ప నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. గత బడ్జెట్లో కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేసిన పరిస్థితి లేదు. 2008లో చింతలపూడి ప్రాజెక్టును రూ.1,701 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాలకు విస్తరించి 4,80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా మార్చింది. ఇప్పటివరకు భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయలేదు. గడిచిన బడ్జెట్లో రూ.272 కోట్లు కేటాయించినా చేసిన ఖర్చు నామమాత్రమే. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రెట్టింపై రూ.9,800 కోట్లకు చేరినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు నాలుగు వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఈ ఖర్చు కూడా గత ప్రభుత్వాల హయాంలోనే జరిగింది. ఈ బడ్జెట్లో కనీసం రూ.1500 కోట్లు కేటాయిస్తే పనులు ముందుకు సాగే పరిస్థితి ఉంది. అయితే వైసిపి ప్రభుత్వం బడ్జెట్లో దీనిపై కనీసం దృష్టి సారించలేదు. తాడిపూడికి గత బడ్జెట్లో రూ.22 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. పనులేవీ ముందుకు సాగలేదు. ఎర్రకాలువ రిజర్వాయర్, తమ్మిలేరు రిజర్వాయర్ పనులకు సంబంధించి గత బడ్జెట్లో రూ.8.43 లక్షలు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్లో కేటాయింపులపై స్పష్టత లేదు.

డెల్టా ఆధునీకరణపై దృష్టి ఏది

వైసిపి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణపై కనీసం దృష్టిసారించిన పరిస్థితి లేదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 11 ప్రధాన కాలువలు 300కుపైగా పిల్ల కాలువలు ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. 2007లో ఉమ్మడి జిల్లాకు రూ.1416 కోట్లతో డెల్టా ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. అయితే వైసిపి ప్రభుత్వం వచ్చాక డెల్టా ఆధునికీకరణ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. గతేడాది బడ్జెట్లో జిల్లాకు కేవలం రూ.12 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇవి కూడా రకరకాల కారణాలతో పూర్తిస్థాయిలో ఖర్చు చేసిన పరిస్థితి లేదు. తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడమే కాకుండా, వర్షాలు తుపాన్లు సంభవించిన సమయంలో ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్న పరిస్థితి. దీనికి తోడు జల వనరులు సమృద్ధిగా ఉన్న జిల్లాలో సాగునీటి ఎద్దడి సమస్యతో రైతులు సతమతమవుతున్నారు.

'పోలవరం'పై ప్రభుత్వానికి చిన్నచూపు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలోనూ, నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. తాము అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు ఇస్తున్న రూ.6.25 లక్షల పునరావాస ప్యాకేజీని రూ.10 లక్షలకు పెంచుతామని, 2006కు ముందు సేకరించిన భూములకు రూ.5 లక్షలు ఇస్తామని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇస్తామని, ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, భూములకు భూములు ఇస్తామని వైసిపి చెప్పింది. కాపర్ డ్యామ్ నిర్మాణం పూర్తి చేయడంతోపాటు ప్రతియేటా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 గ్రామాల్లో 20 వేల కుటుంబాలు గోదావరి వరద ముంపు బారిన పడుతోంది. అయితే నిర్వాసితుల సమస్యలతోపాటు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన వైసిపి ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో కూడా నిర్వాసితులకు మొండిచెయ్యే చూపిందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ప్రకటనలు ఫుల్.. పనులు నిల్!

వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో హడావిడి పర్యటనలు, శంకుస్థాపనలు, ప్రకటనలకే పరిమితమైంది. పనులు చేపట్టి ముందుకు తీసుకెళ్లడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్, కొల్లేరులోకి సముద్ర నీరు ఎగదన్నకుండా మూడు రెగ్యులేటర్ల నిర్మాణం, దగ్గులూరు మెడికల్ కళాశాల నిర్మాణం అన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఉమ్మడి జిల్లాకు తలమానికమని చెప్పుకునే ఆక్వా యూనివర్సిటీని ప్రారంభించినా భవనాల నిర్మాణం నేటికీ పూర్తి చేయలేదు.

రైతులకు ప్రోత్సాహకాలపై నోరు మెదపని బడ్జెట్..

జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు, లక్షన్నర ఎకరాల్లో పామాయిల్, దాదాపు రెండు పంటల కింద పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నాయి. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని కుదించడం, సీడ్, ఫీడ్ ధరలు పెరిగిపోవడం, రొయ్యల ధరల తగ్గిపోవడంతో ఆక్వా సాగు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ బడ్జెట్‌లో ఆక్వా రైతులను ఆదుకునేలా ఎటువంటి ప్రోత్సాహకాలూ లేవు. పామాయిల్ రైతుల పరిస్థితీ ఇంతే. ముఖ్యంగా వరి రైతుల పరిస్థితీ అగమ్యగోచరంగా ఉంది. ఈ బడ్జెట్‌పై వరి రైతులు పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్ జిల్లా అభివృద్ధికిగాని, సమస్యల పరిష్కారానికిగాని దోహదపడేలా లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నోటీసులు అందుకుంటున్న నేతలు లింగరాజు, నాగమణి, శ్యామలారాణి

ఆశాలపై నిర్బంధం

విజయవాడ ధర్నాకు వెళ్లొద్దంటూ

ఆశాలు, సిఐటియు, సిపిఎం నేతలకు నోటీసులు

కార్యాలయాల వద్ద పోలీసు పహరా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు గురువారం విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి పోలీసులు జిల్లాలో సిఐటియు, సిపిఎం, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులకు నోటీసులు ఇచ్చి ముందస్తు అరెస్టులు చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, నాయకులు గోపీ, వి.సాయిబాబు, బి.జగన్నాధరావులకు త్రీటౌన్ పోలీసులు నోటీసులిచ్చారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్‌లకు నోటీసులు అందజేశారు. సిఐటియు నేత శ్యామలారాణికి త్రీటౌన్ పోలీసులు పార్టీ, కార్మిక సంఘాల కార్యాలయాల్లోకి వచ్చి నోటీసులివ్వడమే కాకుండా అక్కడే పహరా కాయడాన్ని నేతలు ఖండించారు. ఆశాల మహాధర్నా నేపథ్యంలో సిపిఎం, సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులను అక్రమ అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యాలయాల్లోకి, సంఘ కార్యాలయాలకు పోలీసులు వచ్చి ముందస్తు నోటీసులు ఇవ్వడం సరికాదని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని ఆశాలు పోరాడుతుంటే సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ఇలా అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీసుల తీరుపై నిరసన

రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాస్వామ్యబద్ధంగా విజయవాడలో ధర్నాకు పిలుపునిస్తే దాన్ని అడ్డుకునేందుకు అప్రజాస్వామికంగా ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి గృహనిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేయడాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద పోలీసు పహరా ఏర్పాటు చేయడం, ఆశాలకు ఎక్కడపడితే అక్కడ నోటీసులిచ్చి ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిర్బంధకాండను నిరసిస్తూ బుధవారం స్థానిక తమ్మిలేరు వంతెన సెంటర్లో నిరసన తెలిపారు. అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు, అనేక దఫాలు మండల, జిల్లాస్థాయిల్లో వినతిపత్రాలు అందజేసి, ధర్నాలు నిర్వహించినా పరిష్కరించలేదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆశాలు విజయవాడ ధర్నాకు పిలుపునిచ్చారని తెలిపారు. ఇప్పటికైనా ఆశాల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆశాలు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, నేతలు బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, ఎస్.రాంబాబు, సుజాత, ఎం.నాగమణి, నారపల్లి రమణారావు, చెల్లమ్మ, కుమారి పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద డిఎన్‌విడి.ప్రసాద్‌కు నోటీసులిస్తున్న పోలీసులు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిఐటియు నేత జె.గోపీ, మహంకాళరావుకు నోటీసులిస్తున్న పోలీసులు

ఓట్ల తొలగింపు ఫారాలు 0.1 శాతం దాటితే అనుమతి తప్పనిసరి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓట్ల తొలగింపు (ఫారం-7) దరఖాస్తులు 0.1 శాతం కన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్ల తొలగింపునకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, కలెక్టరేట్ ఎఒ రమాదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నెరుసు నెలరాజు (బిజెపి), పి.ఆదిశేషు (సిపిఎం), ఎస్.బాబూప్రసాద్ (కాంగ్రెస్), పాలి ప్రసాద్ (టిడిపి) తదితరులు హాజరయ్యారు. ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాకు సంబంధించి రాజకీయ పక్షాల పరిశీలనపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఫారం-7 దరఖాస్తులు 0.1 శాతంలోపు ఉంటే వాటిని పరిశీలించేందుకు జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కమిటీ పరిశీలన అనంతరం సంబంధిత ఓట్ల తొలగింపునకు జిల్లా ఎన్నికల అధికారిగా తాము చర్యలు తీసుకుంటామన్నారు. అదే 0.1 శాతంకన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్లను తొలగించాలంటే రాష్ట్రస్థాయిలో కమిటీ పరిశీలించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పిస్తారన్నారు. ఏలూరు జిల్లాలో చింతలపూడి, ఏలూరు, కైకలూరు నియోజకవర్గాల్లో 0.1 శాతం కన్నా ఎక్కువ ఫారాలు తొలగింపునకు వచ్చాయన్నారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితా విడుదల నాటికి 16,24,416 ఓట్లు నమోదవ్వగా అనంతరం కొత్తగా దరఖాస్తు చేసిన వాటి పరిశీలన అనంతరం అది 16,25,527కు చేరాయన్నారు. జిల్లాలో జనవరి 23వ తేదీ నుంచి ఇంతవరకు అందిన దరఖాస్తుల్లో 14,261 పరిశీలనలో ఉన్నాయన్నారు. వాటిలో ఫారం-6 కింద 2821, ఫారం-7 కింద 6587, ఫారం-8 కింద 4853 పరిశీలనలో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ 10 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. వీటిని సప్లిమెంటరీ ఓటర్ల జాబితాలో చేర్చుతామన్నారు. జిల్లాకు కొత్తగా వచ్చిన తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎస్‌హెచ్‌ఒలతో కూడిన బృందాన్ని ఆ మండల పరిధిలో రాజకీయపక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఒక పరిచయ కార్యక్రమంగా ఇది దోహదపడుతుందని, ఈ దృష్ట్యా సదరు సమావేశానికి సంబంధిత గుర్తింపు పొందిన రాజకీయపక్షాల ప్రతినిధులు హాజరయ్యేలా తెలియజేయాలని అన్నారు.

సిఐటియు నేతల అక్రమ అరెస్టు దుర్మార్గం

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, విజయవాడలో జరగనున్న ధర్నాకు వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గమని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ విమర్శించారు. బుధవారం ఈనెల 8వ తేదీన ఆశాల సమస్యలపై విజయవాడలో జరిగే ధర్నాకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకుని నోటీస్‌లు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేయడాన్ని సిఐటియు మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ నిరంతరం అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆరోగ్య సూచనలిచ్చి అహర్నిశలూ కృషి చేస్తున్న ఆశాలు పెరిగిన ధరలు, చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ గడవక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడకు పిలుపునిస్తే దుర్మార్గంగా అరెస్టులు చేయించడం సిగ్గు చేటని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులు అని చెప్పి మరీ కనీస వేతనం ఇవ్వకుండా గౌరవ వేతనం ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అరెస్టు చేసిన సిఐటియు నాయకులను, ఆశాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాలు కారం రాజేశ్వరి, శ్రావణి, బాపనమ్మ, మార్తమ్మ, పద్మ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు ముమ్మరం

ప్రజాశక్తి - ఏలూరు

రోడ్డు ప్రమాదాల నివారణా చర్యల్లో భాగంగా ప్రమాదాలకు గల కారణాలను అధ్యయనం చేసి నివారణా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలపై ఎస్‌పి మేరీప్రశాంతితో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పోలీసు, ఆర్అండ్‌బి, రవాణా, జాతీయ రహదారుల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు దారి తీసిన గత కారణాలను అధ్యయనం చేసి నివారణా చర్యలు చేపట్టాలన్నారు. గతేడాది 636 వివిధ రోడ్డు ప్రమాదాలు జరగ్గా వాటి మూలంగా 284 మంది మరణించారని, మరో 617 మంది గాయాల బారిన పడ్డారన్నారు. వీటిలో 203 స్కూటర్ యాక్సిడెంట్లు ఉండగా 107 మంది హెల్మెట్లు ధరించకుండా ప్రమాదానికి గురైనవారున్నారన్నారు. హెల్మెట్ ధారణపై ప్రత్యేక చర్యలు చేపట్టి తొలిగా సున్నితంగా హెచ్చరించి తదుపరి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విషయంపై మరింత చైతన్యం తీసుకురావాలన్నారు. బిఐఎస్ నాణ్యత గల హెల్మెట్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి డివైడర్లపై పెంచే మొక్కలకు నీటి సరఫరాకు వినియోగించే ట్యాంకర్లకు కిలో మీటరులోపు నుంచి భద్రత కోన్స్ వినియోగించడం లేదా డ్రిప్ సదుపాయం కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. అలా కాకుండా ప్రమాదాలకు అస్కారం కలిగించేరీతిలో వ్యవహరిస్తే కేసు నమోదు చేయాలన్నారు. జిల్లాలో భీమడోలు ప్రాంతంలో ట్రామా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను వైద్య ఆరోగ్యశాఖకు యుద్ధప్రాతిపదికపై సమర్పించాలని డిసిహెచ్‌ఎస్‌ను కలెక్టర్ ఆదేశించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు, రవాణా శాఖ ఆధ్వర్యంలో బోర్డర్ చెక్ పోస్టులు తదితర అంశాలపై ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యతగా గుర్తెరగాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలతోపాటు ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు తు.చ తప్పక పాటిస్తే ప్రమాదాలు నివారించడంతోపాటు కొన్ని ప్రాణాలను కాపాడుకోగలుతామన్నారు. జిల్లా పరిధిలో పలు ప్రమాదాలకు అస్కారమున్న ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు తాత్కాలిక, దీర్ఘకాలిక నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రోడ్లకు పడిన గుంతలను పూర్తి చేసే పనులను రూ.30 కోట్లతో చేపట్టి మార్చి 15 నాటికి పూర్తి చేస్తామని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఉప రవాణ కమిషనర్ ఎస్.శాంతకుమారి మాట్లాడుతూ హిట్ అండ్ రన్ ప్రమాదాలకు సంబంధించి మరణించిన వారికి రూ.రెండు లక్షలకు, గాయాలైన వారికి రూ.50 వేలకు పరిహారం పెంచారన్నారు. సమావేశంలో డిసిహెచ్‌ఎస్ పాల్ సతీష్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఏలూరు డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, ఆర్‌టిఒలు కె.శ్రీహరి, ఎమ్‌డి.మదాని, ఎంవిఐలు కెవిఎస్.ప్రసాద్, జి.ప్రసాదరావు, పలువురు జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

మాట్లాడుతున్న రవాణా శాఖ ఉప కమిషనర్ శాంతకుమారి

రోడ్డు భద్రత నిబంధనలు పాటించినవారే నిజమైన డ్రైవర్

రవాణా ఉప కమిషనర్ ఎస్.శాంతకుమారి

ఆటో, క్యాబ్, స్కూల్ బస్సు డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు

వాహనాన్ని నడిపే ప్రతిఒక్కరూ డ్రైవర్ కాలేరని, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించినవారే నిజమైన డ్రైవర్ అవుతారని రవాణా శాఖ ఉప కమిషనర్ ఎస్.శాంతకుమారి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఏలూరు డిటిసి కార్యాలయంలో ఆటో, క్యాబ్, విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ 2030 నాటికి రోడ్డు ప్రమాదాలను సగానికి తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. దానిలో భాగంగానే వివిధ శాఖల సమన్వయంతో రహదారి భద్రత అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరు మరణిస్తుండటం గమనార్హమన్నారు. డ్రైవర్ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చగలరని, అదే విధంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి సంబంధిత పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరన్నారు. క్షతగాత్రులను కాపాడటంలో వైద్యుని పాత్ర ఎంత ఉందో, ప్రయాణికులను సురక్షితంగా చేర్చడంలో డ్రైవర్లకూ అంతే బాధ్యత ఉందన్నారు. అతివేగం, మద్యం వంటి మత్తు పానీయాలు సేవించి, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపడం మానుకోవాలని హితవు పలికారు. కూలీలను తరలించేటప్పుడు పరిమితిని మించకూడని ఆమె హెచ్చరించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కెవిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ 95 శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్ల, మిగిలిన ఐదు శాతం రహదారి నిర్మాణం లోపాల వల్ల జరుగుతున్నాయని పలు నివేదికలు తెలుపుతున్నాయన్నారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి మేనేజర్ ఇల్లి రమేష్‌బాబు నేతృత్వంలో 15 మంది వైద్యులు ఉచిత వైద్య శిబిరంలో 300కుపైగా డ్రైవర్లకు కంటి సంబంధిత, గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బిపి తదితర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా జనరల్ మెడిసిన్ అందజేశారు.

సిఎం జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మండవల్లి

పెద్దవాళ్లకు, పెత్తందారులకు యుద్ధమని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అయ్యవారిరుద్రం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని రాజకీయ నాయకుల్లో జగన్మోహన్ రెడ్డి బాగా డబ్బున్నవాడని, ఆయన కంటే డబ్బున్న వారు రాష్ట్రంలో ఎవరూ లేరని అన్నారు. రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందంటే అది ఆంధ్ర రాష్ట్రం అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకపోవడంతో రైతులు నీరందక పంటలు నష్టపోతున్నారన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో అరాచకాలు మితిమీరి పోయాయని, సామాజిక న్యాయం పేరుతో బలహీన వర్గాలకు తీవ్ర నష్టం కలుగుతోందని అన్నారు. ఈ దుర్మార్గపు పాలనను అంతమొందించడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు పడే ఇబ్బందులపై పోరాటం చేయడంలో ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమం నిమిత్తం వస్తున్న ఆయనను భారీ ఎత్తు ఊరేగింపుతో తీన్మార్ డబ్బులతో ర్యాలీగా ఘనంగా ఆయనను సభాస్థలికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పులి కదలికలపై అటవీ అధికారుల నిఘా

పోలవరం: సుమారు 20 రోజులుగా జిల్లాలోని బుట్టాయగూడెం, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల్లో సంచరించి తాజాగా పోలవరం మండలంలో ప్రత్యక్షమైన పెద్దపులి కోసం అటవీ అధికారులు నిఘా పెంచారు. ద్వారకాతిరుమల, బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో ఆవు దూడలపై పెద్దపులి దాడి చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురైన సంగతి తెలిసిందే. అభయారణ్యంలోకి వెళ్లిపోయిందనుకున్న పులి పోలవరం మండలం ఉడతపల్లిలో ఆవు దూడపై దాడికి పాల్పడటంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం అటవీ శాఖ అధికారులు కన్నాపురం, పోలవరం రేంజ్ పరిధిలోని అభయారణ్యంలో బృందాలుగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ పులి కదలికలపై నిఘా ఉంచినట్లు అటవీ క్షేత్రాధికారి ఎన్.దావీదురాజు తెలిపారు. కన్నాపురం రేంజ్ పరిధిలో రెండు బృందాలు, పోలవరం అటవీ శాఖ రేంజ్ పరిధిలో నాలుగు బృందాలు పులి పాదముద్రల అన్వేషణ, కదలికలపై పని చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఉడతపల్లి, మెత్తప్పకోట, జిల్లెళ్లగూడెం ఏజెన్సీ గ్రామాల పరిధిలో ప్రజలను అప్రమత్తం చేస్తూ సంబంధిత అధికారులు వాలంటీర్లతో గ్రామాల్లో ప్రజలకు పులి సంచారంపై హెచ్చరికలు జారీ చేస్తున్నారు.


కలెక్టర్‌ను కలిసిన రమేష్ కుమార్

'ఉద్యోగులకు సహకారం అందించాలి'

ఏలూరు అర్బన్: రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారంతోపాటు పరిపాలనా విషయాలలో కూడా ఉద్యోగులకు సహకారం అందించాలని రమేష్ కుమార్‌కు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కె.రమేష్ కుమార్ ఎన్నికైన సందర్భంగా బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్ప మణిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు రమేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓట్ ఫర్ ఒపిఎస్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు: మన భవిష్యత్ నిర్ణయించేది మనం ఎన్నుకున్న రాజకీయ నేతలే.. కాని వారి రాజకీయ భవిష్యత్తు నిర్ణయించేది మన ఓటే.. మన ఓటు ఎవరికో అంటూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యాన పోస్టర్ ఆవిష్కరించారు. ఒపిఎస్ పునరుద్ధరణకు సాగుతున్న కార్యక్రమంలో భాగంగా మన ఓటు మన భవిష్యత్తు అంటూ 'ఓట్ ఫర్ ఒపిఎస్' వాల్‌పోస్టర్‌ను స్థానిక ఏలూరు నగరంలోని ఎఆర్‌డిజికె హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు ఉజ్వల సమక్షంలో యుటిఎఫ్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, జిల్లా కార్యదర్శి ఈడే శివశంకరరావు, ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఓటర్లు 2,71,507 మంది

చింతలపూడి: నియోజకవర్గంలో 2,71,507 మంది ఓటర్లు ఉన్నారని చింతలపూడి ఎన్నికల రిటర్న్ అధికారి అద్దయ్య అన్నారు. మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు ఓటర్ లిస్ట్ ఇచ్చామని చేర్పులు ఉంటే తెలియజేయమని కోరినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపాలకృష్ణ, టిడిపి మాజీ నియోజకవర్గ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి, సిపిఐ బాబు పాల్గొన్నారు.

నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యాన నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ ఎం.సూర్య తేజ, పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. వీరి చేతుల మీదగా మండలంలోని 888 సంఘాలకు, 8,878 సభ్యులకు రూ.4 కోట్ల 48 లక్షల 10 వేల చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు, పోలవరం నియోజకవర్గం సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ మొత్తాన్ని మహిళల జీవనోపాధికి వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామ తులసి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ బాజీ పాల్గొన్నారు.

తాగునీటి చెరువులు త్వరగా నింపుకోవాలి

ముదినేపల్లి: మండలంలోని మంచినీటి చెరువులను పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు త్వరితగతిన నింపుకోవాలని ముదినేపల్లి మండల పోల్ రాజ్ కెనాల్, సిబి కెనాల్ ఎఇలు కిషోర్, సిద్ధార్థ కోరారు. బుధవారం ముదినేపల్లిలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం పంట కాల్వల ద్వారా వస్తున్న నీటిని కార్యదర్శులు పంట కాలవల నుంచి లిఫ్ట్ చేసుకుని మంచినీటి చెరువులు నింపుకోవాలన్నారు. కాలువల్లో నీరు పూర్తిస్థాయిలో రానందున ఇంజిన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మరో రెండు, మూడు రోజులు మాత్రమే కాలువలకు నీరు వస్తుందని, తరువాత కాలువలను మూసివేయడం జరుగుతుందన్నారు. పంట కాలువల ద్వారా వచ్చే తాగునీటిని ఎవరైనా ఆక్వా రైతులు చేపల చెరువులకు మళ్లిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సింగరాయపాలెంలో ఇంజన్ ద్వారా మంచినీరు

మండల ఓటర్లు 49,082 మంది

ముదినేపల్లి: నూతన ఓటర్ల జాబితా ప్రకారం ముదినేపల్లి మండల ఓటర్ల సంఖ్య 49,082కి చేరింది. గతం కంటే సుమారు వెయ్యి ఓట్లు పెరిగాయి. మండలంలోని 61 పోలింగ్ బూత్‌ల పరిధిలో 24,173 మంది పురుష ఓటర్లు కాగా, 24,905 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మండలంలో మహిళా ఓటర్లే ఎక్కువ. ట్రాన్స్ జెండర్ల ఓట్లు నాలుగు ఉన్నాయి.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కంచర్ల రమేష్(35)ను మీర్జాపురం గ్రామ సమీపాన బుధవారం తెల్లవారుజామున చేపల లోడు లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

నూజివీడు రూరల్: మండలంలోని సిద్ధార్థ నగర్‌కు చెందిన తన కుమార్తె కనిపించడం లేదని నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈనెల 1వ తేదీన టిఫిన్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని తండ్రి చెప్పినట్లు పేర్కొన్నారు. బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి మహిళకు గాయాలు

జీలుగుమిల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి మహిళకు గాయాలైన ఘటన మండలంలోని పి.అంకంపాలెం సమీపంలోని రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జి.క్రీష, భార్య గంగ భవానీతో ద్విచక్ర వాహనంపై జీలుగుమిల్లి వస్తుండగా గ్రామ శివారులో గొయ్యిని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఆమె బండి మీద నుంచి కింద పడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు, కాలుకి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం 108లో జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

జీలుగుమిల్లి: మండలంలోని సిరివారిగూడెం గ్రామ శివారులో బుధవారం పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సిరివారిగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.5,900 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మహిళకు ఏడాది జైలు, జరిమానా

ఏలూరు స్పోర్ట్స్: డబ్బులు ఒక వ్యక్తి నుంచి అప్పుగా తీసుకొని నకిలీ చెక్కు అతనికి ఇచ్చి మోసం చేసిన కేసులో మహిళకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.4 లక్షల అపరాధ రుసుమును విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. సంబంధిత వివరాల్లోకి వెళితే ఏలూరు వెలివెళ్ల నగర్ ఎస్ఐ కాలనీలో నివాసముంటున్న బుడుపుల రవీంద్ర భార్యాభర్తలుగా కలిసి జీవిస్తున్నారు. 2019లో ఏలూరు నగరంలోని ఆర్ఆర్ పేటకు చెందిన తిరుమల పెద్దిరెడ్డి మాధవి రవీంద్ర దగ్గర అప్పు తీసుకుంది. తిరిగి చెల్లించే క్రమంలో అతనికి నకిలీ చెక్కు ఇచ్చి మోసం చేసింది. దీంతో రవీంద్ర కోర్టును ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ, ఎంపిపి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే సభ్యులు తాము గత సమావేశంలో లేవనెత్తిన సమస్యల పరిష్కారం ఏమేరకు జరిగిందన్న విషయాలతో ప్రస్తుత సమావేశానికి హాజరు కావాలని భీమడోలు ఎంపిపి కనమాల రామయ్య కోరారు. వీటిపై విచారణ జరిపి సమస్యల త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తొలుత భీమడోలు ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగ, ఎంపిడిఒ టి.స్వర్ణలత, భీమడోలు తహశీల్దార్ జి.వరహాలయ్య విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈనెల 9వ తేదీన నిర్వహించే నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు ఆరోజు పంపిణీ చేయాల్సిన నులిపురుగు నివారణ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య శాఖ అధికారులు, మండల విద్యాధికారులు మాత్రల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం కొనసాగిన సర్వసభ్య సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరపు మండల బడ్జెట్ తయారీలో భాగంగా ఒక్కొక్క ఎంపిటిసి పరిధిలో రూ.5 లక్షల వరకు విలువైన పనుల కేటాయింపుకు అవకాశం ఉందన్నారు. దీని ఆధారంగా సభ్యులు తాగునీరు, వ్యవసాయం, అంతర్గత, అనుసంధాన రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులకు ప్రాధాన్యత ఇస్తూ పనులను సిఫార్సు చేయాలని కోరారు. గతంలో కేటాయింపు జరిగి ఇంతవరకు ప్రారంభం కాని సీసీ రోడ్ల నిర్మాణ పనుల స్థానంలో మరొక నూతన పనులు చేపట్టేందుకు ఎంపిటిసిలు ప్రతిపాదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ అధికారిగా వ్యవహరించిన భీమడోలు ఎంపిడిఒ మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు సర్వసభ్య సమావేశాలకు హాజరు కావటానికి మూడు రోజులు ముందు తమ శాఖ ద్వారా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు, రానున్న కాలంలో చేపట్టనున్న పనుల జాబితాను రాతపూర్వకంగా సమావేశానికి ముందు ఎంపిడిఒ, ఎంపిపికి సమర్పించాలని సూచించారు. దీనివల్ల సదరు వివరాలను మండల పరిషత్ సమావేశ సందర్భంగా ముందుగానే సభ్యులకు తెలియజేస్తామన్నారు. ట్రాన్స్‌కో భీమడోలు సహాయ ఇంజనీర్ రామస్వామి మాట్లాడుతూ ఎంఎల్ఎ చొరవతో భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలో ఫేజ్ కన్వర్షన్‌లో వోల్టేజ్, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండల పరిధిలోని 32 జగనన్న కాలనీలో 26 కాలనీలకు విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. వీటిలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు విద్యుత్ సరఫరా కోసం అవసరమైన సామాగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. భీమడోలు వ్యవసాయ అధికారిణి ఉషారాణి మాట్లాడుతూ గత సీజన్‌లో ఆర్‌బికెల ద్వారా మండల పరిధిలోని రూ.50 వేల కోట్ల విలువైన 25 వేల మెట్రిక్ ధాన్యాన్ని 3,506 మంది రైతుల నుంచి సేకరించి పూర్తిస్థాయి చెల్లింపులు జరిపామన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో 12 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు జరుగుతుందన్నారు. రైతుల వివరాలను ఇకెవైసి ద్వారా నమోదు చేశామన్నారు. గత సీజన్‌లో కురిసిన వానల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ త్వరలో విడుదల కానుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు డోకల వాసంతి, రైతు సలహా మండలి మండల ఛైర్మన్ పసుపులేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రల గోడపత్రిక ఆవిష్కరణ

నులిపురుగు నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

చాట్రాయి: ఆరోగ్యకరమైన చిన్నపిల్లలను కాపాడటానికి నులుపురుగులను నులిమేద్దామని చాట్రాయి మండల ఎంపిడిఒ మంగాకుమారి అన్నారు. బుధవారం చాట్రాయి ఎంపిడిఒ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి ఎ.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లల ఎదుగుదల లోపానికి, రక్తహీనతకు కారణమైన నులిపురుగుల నివారణ కోసం ఒకటి నుంచి రెండు సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ 200 మిల్లీగ్రాముల మాత్రలు వాడాలని, రెండు సంవత్సరాల నుంచి పైపడిన చిన్న పిల్లలకు 400 మిల్లీగ్రాముల మాత్రలు వాడి నులుపురుగులను నివారణ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది వెంకటరమణ, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

అజరయ్య పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష

నూజివీడు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సురక్ష వైద్య సేవలను వినియోగించుకోవాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. నూజివీడు పట్టణంలోని అజరయ్య పేటలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి విచ్చేసిన స్థానికులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కల్లేపల్లి ప్రియాంక, వైసిపి నాయకులు పిల్ల చరణ్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షులుగా కలగర నాని

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం వ్యవసాయ పరపతి సంఘం నూతన అధ్యక్షులుగా కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కలగర నాని ప్రమాణ స్వీకారం చేశారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టినటువంటి తనకు వ్యవసాయంలో ఉండే కష్టసుఖాలు, లాభనష్టాలు గురించి తెలుసని ఆవిధంగా రైతులకు అవసరమైన పంట రుణాలను సొసైటీ ద్వారా సబ్సిడీ ఎరువులను ఇప్పించుటకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరం దుర్గారావు, చంద్రం పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

బుట్టాయగూడెం : జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో తెల్లం బాలరాజు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టివిఆర్ ట్రోఫీ సీజన్ ఫైవ్ ఆటల పోటీలను పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో ఈ టిబిఆర్ ట్రోఫీ సీజన్ 5లో వాలీబాల్, విలువిద్య, కబడ్డీ ఆటల పోటీలు జరుగుతాయని, ఈ క్రీడల్లో క్రీడాకారుల నైపుణ్యం బయటకు తీసి ప్రోత్సాహకంగా మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.10వేలుగా నిర్ణయించారు. ఈనెల 9న బుట్టాయగూడెం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బహుమతుల ప్రధానోత్సవం ఎంఎల్ఎ, వైసిపి నాయకుల చేతుల మీదుగా జరుగుతుందని తెలియజేశారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ముసునూరు: గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు ఉపాధిహామీ నిధులతో అభివృద్ధి చేయాలని ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రమైన ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో 16 గ్రామాల ఉపాధిహామీ చట్టం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రతి ఒక్కరూ 100 రోజులు పూర్తియ్యేలా చర్యలు తీసుకోవాలని, జలజీవన్ మిషన్ ద్వారా గ్రాంట్లు, ఆయా నిధులు మంజూరు తదితర అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ టి.రోజ్‌లీలా, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని భార్యకు రూ.10 వేలు అందజేత

ఆగిరిపల్లి: ఈదులగూడెం పిఎసిఎస్‌లో సభ్యులైన కలటూరు గ్రామ పంచాయతీ శివారు తత్ర మానికల శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మరణించగా సహకార సంఘ నిధుల నుంచి రూ.10 వేలు మట్టి ఖర్చుల కింద మృతుని భార్య అంజలికి అందజేశారు. కృష్ణాజిల్లా సహకారకేంద్ర బ్యాంక్ ఉత్వర్వుల ప్రకారం పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, కలటూరు గ్రామ సర్పంచి రాఘవరపు సురేష్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈదులగూడెం పిఎసిఎస్ సిఇఒ జాలిపర్తి శ్రీనివాసరా పాల్గొన్నారు.

'రా.. కదలిరా' విజయవంతానికి కృతజ్ఞతలు

చింతలపూడి: మండలంలో రా కదిలి రా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని చింతలపూడి నియోజకవర్గం పరిశీలకులు కోళ్ల నాగేశ్వరావు అన్నారు. చింతలపూడి పట్టణం వికెఎం ఫంక్షన్ హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియాపై దాడికి మన్నించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జబర్దస్త్ బృందం ప్రచారం

టి.నరసాపురం : జబర్దస్త్ టీంతో పాటు సినీ గాయకుల బృందం సభ్యులు బుధవారం మండలంలో బిజెపి తరుపున ప్రచారం నిర్వహించి సందడి చేశారు. మండలంలోని మల్లుకుంటలో ప్రారంభమైన ప్రచార యాత్ర బొర్రంపాలెం, శ్రీరామవరం, టి.నరసాపురం గ్రామాలలో పర్యటించి మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి చేస్తున్న వివిధ సేవలను ప్రజలకు వివరించారు.

ఉపాధిహామీని పటిష్టంగా అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలో ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులు పని, కనీసం వేతనం రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షురాలు యాగంటి సీత అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం, మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్ రావు మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ బకాయిలు రూ.50 లక్షలు వరకు ఉన్నాయని, తక్షణమే ఈ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంకో పక్క పని జరిగే గ్రామాల్లో పే స్లిప్పులు ఇవ్వటం లేదని దీని ద్వారా కూలీలు లక్షల రూపాయల వేతనాలు కోల్పోతున్నారని ఉపాధి హామీ అధికారులపై మండిపడ్డారు. నిరంతరం వ్యవసాయ ఉపాధి కార్మికుల కోసం పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంలో ప్రతిఒక్క కార్మికుడు సభ్యులుగా చేరాలని కోరారు. ఈ సమావేశంలో జోడే సూర్యచంద్రరావు, కె.సుబ్బారావు, వామిశెట్టినరసరావు, కె.వెంకటేష్, పి.చంటి పాల్గొన్నారు.

హెచ్‌ఐవి రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

డాక్టర్ సుమ

ప్రజాశక్తి - మండవల్లి

హెచ్‌ఐవి రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ సుమ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, చైల్డ్ ఫ్రంట్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సహాయంతో తక్కెళ్లపాడులో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక సంబంధాలు, సురక్షితం కాని సూదులు, సిరంజిలు, రక్త మార్పిడి, హెచ్‌ఐవి ఉన్న తల్లితండ్రుల ద్వారా బిడ్డకు మాత్రమే వస్తుందని అన్నారు. ఈ వ్యాధి సోకిన వారు ఎఆర్‌టి మందులు వాడి వారి జీవిత కాలాన్ని పెంచుకోవచ్చు అని తెలిపారు. సూపర్వైజర్ రాకేష్ మాట్లాడుతూ 2017 యాక్ట్ ప్రకారం హెచ్‌ఐవి సోకిన వారిని ఎవరైనా చులకనగా చూడడం, అవహేళన చేయడం నేరమన్నారు. అలా ఎవరైనా చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1097కు సమాచారం అందించాలని తెలిపారు. వారికి మూడు నెలలు లేదా రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగేంద్రరావు, సెక్రటరీ ఎన్.ఆంజనేయులు, హెల్త్ సూపర్వైజర్ కె.భాస్కర్, ఎఎన్ఎం జ్యోతి పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్: ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 15 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించామని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏలూరు ఇన్నర్ వీల్ క్లబ్ బృందం తలసేమియా చిన్నారులను పరామర్శించారని, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ పి.సుబ్బలక్ష్మి, హనుమంతరావు దంపతులు తలసేమియా కేంద్రానికి రూ.16 వేల చెక్కును విరాళంగా అందజేశారన్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి వారికి, తలసేమియా చిన్నారులకు, వారి సహాయకులకు ఉచిత భోజనం ఏర్పాటు చేసిన మల్లిశెట్టి తిరుమల రావు, కృష్ణ తులసిలకు అభినందనలు తెలిపారు. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ క్రమం తప్పకుండా తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ పిఎస్.సుబ్బలక్ష్మి, కార్యదర్శి జి.అచ్యుత, పి.సుబ్బలక్ష్మి, వివివి.హనుమంతరావు, కెవి.రమణ, వి.నాగరాజు పాల్గొన్నారు.

విలేకరులపై దాడిని ఖండిస్తూ నిరసనలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

చింతలపూడిలో ఈనెల 5న జరిగిన రా కదలి రా బహిరంగ సభలో దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ జంగారెడ్డిగూడెం విలేకరులపై చేసిన దాడిని ఖండిస్తూ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యాన తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడూరి ఆనంద్, నూకల క్రాంతినాథ్, మామిడి శెట్టి శ్రీరాంప్రసాద్, జక్కుల దాసు, శీలం కృష్ణమోహన్, గంజి మధుబాబు, పాముల మురళీకృష్ణ, మర్రి రమేష్, కారం భాస్కర్, నిట్టా రవి, రామకృష్ణ, తలారి దాసు పాల్గొన్నారు.

చింతలపూడి: ఈనెల 5వ తేదీ సోమవారం చింతలపూడిలో రా కదలిరా బహిరంగ సభ కార్యక్రమంలో మీడియాపై జరిగిన దాడి జర్నలిస్టుల హక్కులను హరించడమే అని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ట్రెజరరీ చెన్నారావు అన్నారు. చింతలపూడి పట్టణంలో విలేకరులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనిపై జిల్లా ఎస్‌పికి, జంగారెడ్డిగూడెం డిఎస్‌పికి ఫిర్యాదు చేశామన్నారు. విలేకరులపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ చింతలపూడి సభ్యులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం :వినతినందిస్తున్న జర్నలిస్టులు

అంబేద్కర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా శాంతరాజు

ప్రజాశక్తి - మండవల్లి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ మండవల్లి కమిటీ నూతన అధ్యక్షులుగా కొరపాటి శాంతరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునే విధంగా మండవల్లిలో మంగళవారం సమావేశ నిర్వహించారు. ఈ సమావేశంలో అంబేద్కర్ ఆశయాలను, ఆలోచన విధానాలను మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసోసియేషన్ కమిటీని రద్దు చేస్తున్నట్లు అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు ప్రకటించారు. దీంతో గ్రామస్తుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొరపాటి శాంతరాజు, ఉపాధ్యక్షులుగా పాగొల్లు అభిష, బేతపూడి తంబి, సెక్రటరీగా కొండపల్లి రవి, జాయింట్ సెక్రటరీగా వట్టిప్రోలు సుధీర్, ట్రెజరర్‌గా దాకరపు వినోద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మెండ రాజేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారుగా గోరింక గాంధీ, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా జంగం వివేకులను ఎన్నుకోవడంతో పాటు గౌరవాధ్యక్షులుగా లంకపల్లి భాస్కరరావు, దాసరియోహన్‌రాజు, మెండ సురేష్, చాపత్తిని విజయ్, చిగురుపాటి ఐజక్, మేడేపల్లి సైమన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతరాజు మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తా అన్నారు. అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు గ్రామస్తులకు, ముఖ్యంగా యువతకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

ముదినేపల్లి: వాహనదారులందరూ తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రయాణాలు సాగించాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కోరారు. ఎంపిపి సత్యనారాయణ వైసిపి నాయకులతో కలిసి బుధవారం ముదినేపల్లిలోని టాటా ఇంట్రా కంపెనీ వారి విజయోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ టాటా ఇంటాన్ వ్యాన్లు అత్యధిక అధునాతనమైన టెక్నాలజీలతో మార్కెట్లోకి వచ్చి అత్యధికంగా కొనుగోలు చేశారని, ఇంకా మరింత టెక్నాలజీతో టాటా కంపెనీ సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలిదిండి ఎఎంసి వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్షు, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణువర్ధన్ టాటా కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏలూరు ఆర్ఆర్ పేట సర్వీస్ రిజర్వాయర్ వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన మస్తర్ టైంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి సంక్రాంతి సందర్భంగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి బహుమతి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తానని ఇచ్చిన జిఒని తక్షణమే అమలు చేయాలని ఆయన కోరారు. అలాగే డిసెంబరు నెలలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తే సమ్మె కాలానికి వేతనాలు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, తక్షణమే సమ్మె కాల వేతనాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మె విరమణ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులు, రాష్ట్ర మంత్రివర్గం ఇచ్చిన హామీని అమలు చేయని కారణంగా ఈనెల 8న ఎఐటియుసి అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం విజయవాడలో జరుపుకొని భవిష్యత్తు కార్యాచరణని నిర్ధారిస్తామని ఆయన తెలిపారు.

కిసాన్ క్రెడిట్ కార్డు సేవలు వినియోగించుకోవాలి

భీమడోలు : పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డు సేవలను రైతులు వినియోగించుకోవాలని ఆ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ కోరారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కిసాన్ క్రెడిట్ కార్డుదారులకు వారి సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలు లభిస్తాయన్నారు. దీంతో పశువుల మేతకు అవసరమైన గడ్డి క్షేత్రాల పెంపకం వినియోగించాల్సి ఉంటుందన్నారు. పశువుల షెడ్డు నిర్మాణానికి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల కోసం తగు మొత్తాలు మంజూరయ్యాయని, అర్హులైన లబ్ధిదారులు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

త్యాగానికి ప్రతిరూపం రమాబాయి అంబేద్కర్

మండవల్లి: త్యాగానికి ప్రతిరూపం రమాబాయి అంబేద్కర్ అని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కర్ రావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాబాయి 127వ జయంతి కార్యక్రమాన్ని మండవల్లి గ్రంథాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రమాబాయి మహిళా లోకంలో ఆమె ఒక మణి పూస అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు వట్టిప్రోలు సుధీర్ పాల్గొన్నారు.

'ఎంపీ శ్రీధర్ మరిన్ని పదవులు అధిరోహించాలి'

ఏలూరు అర్బన్: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆటోనగర్ అధ్యక్ష, కార్యదర్శుల అరుణతార నాగేశ్వరరావు, అడపా సత్యనారాయణ తెలిపారు. ఆల్ ఇండియా ఫుట్ బాల్ ఫెడరేషన్ డిప్యూటీ ఛైర్మన్‌గా కోటగిరి శ్రీధర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్థానిక ది ఏలూరు టౌన్ ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సంఘ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

దస్తావేజు పోయినది

నాక్లయింట్ అయిన ఏలూరు జిల్లా లక్ష్మీపురం గ్రామం, పెదవేగి (మం) కు చెందిన **శ్రీ సూర్రెడ్డి వెంకటేశ్వరరావు** S/o. లక్ష్మయ్య అను వారు తెలియజేయునది ఏమనగా వారి యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం. **6403/1986** రు గల తేది. 17.10.1986 గల డాక్యుమెంట్ పెదవేగి గ్రామము నందు జిరాక్స్ తీయుంచుటకు వెళ్ళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది.. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్ కు తెలియ చేయగలరు.

E.SRINIVASA BABU, Advocate
Eluru, Ph : 08812-239498

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, గణపవరం మండలం, అర్ధవరం గ్రామం, డోర్‌నెం. 4-66కి చెందిన యిందుకూరి వెంకట సుబ్బరాజు S/o.యిందుకూరి సత్యనారాయణరాజు అను నేను 6-2-2024 తేదీన నాయొక్క ఒరిజినల్ దస్తావేజులను తీసుకొని నా స్వగ్రామం అయిన అర్ధవరం నుండి గణపవరం జిరాక్స్ తీయించుటకు వెళ్ళినాను. జిరాక్స్ తీయించుకొని తిరిగి గణపవరం నుండి నా స్వగ్రామం అయిన అర్ధవరం వస్తుండగా దారి మధ్యలో పడిపోయినవి. దస్తావేజు నెంబర్. 1565/1975 దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు.

యిందుకూరి వెంకట సుబ్బరాజు, S/o.యిందుకూరి సత్యనారాయణరాజు,
డోర్‌నెం.4-66, దిబ్బాలమీద, అర్ధవరం,
గణపవరం మండలం, ప.గో.జిల్లా. సెల్: 9177146789

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం/ పట్టణ గ్రామస్తులు, బుంగా రాంబాబు S/o చంద్రరావు గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా.

నా క్లయింట్ జంగారెడ్డిగూడెంలో R.S.No: 356 లో చు॥గ॥ 212 లు స్థలం చాగల్లు మండలం వాస్తవ్యులు కొత్తపేట కరుణ W/o పుట్టయ్య గారి వద్ద నుండి కొనుగోలు చేసి జంగారెడ్డిగూడెం SRO లో క్రయ దస్తావేజు 448/2018 తేది. 22-1-2018 రిజిస్ట్రీ చేసుకొనియున్నారు. 1) కొత్తపేట కరుణ గారు మల్లిన శ్రీనివాస్ గారి వద్ద కొనుగోలు చేసిన డాక్యుమెంట్ నెం. 1202/2007 తేది. 29-3-2007 2) మల్లిన శ్రీనివాస్ గారు యర్రంశెట్టి నాసరయ్య గారి వద్ద నుండి కొనుగోలు చేసిన డాక్యుమెంట్ నెం. 2305/2006, తేది. 8-5-2006. ఈ రెండు ఒరిజినల్ లింకు డాక్యుమెంట్స్ తేది. 1-2-2024 తేదిన జంగారెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్లో జిరాక్స్ తీసుకొనుటకు వెళ్ళి చూసుకొనగా కనిపించియుండలేదు. తదుపరి ఎంత వెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైననూ దొరికిన ఎడల క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

Sd/- **M.RAMAMOHAN RAO** B.Com., B.L.
ADVOCATE, Jangareddigudem
Cell: 94414 47739

In the Court of the Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 367/2023

Between:
Borsu Veera Venkata Subrahmanyam ***...Plaintiff***
AND
Peddy Veera Venkata Satyanarayana ***...Respondent***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాది: రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, S/o. వీర రాఘవులు, హిందు, పురుషుడు, 55 సం॥లు, బిజినెస్, డో.నెం. 3-24/1, Canal Street, వేల్పూరు గ్రామం, తణుకు మండలం, తణుకు, ప॥గో॥జిల్లా.

పై నంబరు దావా గ్రంథములో మీరు ప్రతివాది అయి వున్నారు. మరియు I.A. No. 820/2023 నందు రెస్పాండెంటు అయి వున్నారు. పై నంబరు దావా గ్రంథము మరియు I.A. No. 820/2023 నందు శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం మీకు ఎన్నిసార్లు సమన్లు మరియు నోటీసులు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు ఈ ప్రకటన ప్రచురితమైన తేది నుండి 30 రోజులులోగా మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు ఎదుట హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేయవలసి నదిగాను, అట్లు కాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

NEELAM HARISH NAIDU
Advocate, Tanuku
Cell: 9293222187